క్లుప్తంగా

కేవీఎల్ఎన్ రెడ్డిని పరామర్శించిన కేంద్ర మంత్రి



జనగామ రూరల్ : జనగామ పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు కేవీఎల్ఎన్ రెడ్డి తండ్రి భూపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డిని పరామర్శించారు. అనంతరం భూపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, ఆరుట్ల దశమంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పాలకుర్తి : మండలంలోని గూడూరులో మహ్మద్‌వలిబాషాకు చెందిన ఇంట్లో 34 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశామని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వలికి చెందిన అద్దె ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం అందడంతో వెళ్లి స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బచ్చన్నపేట : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై ఎస్‌కె హమీద్ తెలిపారు. మండలంలో ఇసుక మాఫియా దందా కొనసాగుతుందన్న సమాచారం మేరకు పోలీసులతో గస్తీ నిర్వహించామని ఎస్సై అన్నారు. పోచన్నపేట వాగు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని తెలిపారు.

యోగాతో ఆరోగ్య సంరక్షణ

హన్మకొండ చౌరస్తా: ప్రకృతి వైద్యం, యోగాతో వయో వృద్ధులు ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని ఇంటర్నేషనల్ నేచురోపతి ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సంగాల రవీందర్ తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఒలివా ఆంక్యుపంక్చర్ క్లినిక్‌లో నిర్వహించిన శిబిరానికి అధిక సంఖ్యలో హాజరైన వృద్ధులను ఉద్దేశించి ఆ యన మాట్లాడారు. శరీర స్వీయ, స్వస్థత సా మర్థ్యాలకు ప్రకృతితో ఉన్న అనుసంధానాన్ని ప్రకృతి వైద్యం తెలియజేస్తుందని చెప్పారు. అనంతరం డాక్టర్ అన్వేష్ దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించగా హాజరైన వారికి పండ్లు, మొలకలు, మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో టింబరేని అనిల్‌కుమార్, ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఐలోనిలో భక్తుల సందడి

ఐనవోలు : వారాంతపు జాతరలో భాగంగా ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో ఆలయంలో పూజలు ప్రారంభం కాగా నిత్య కైంకర్యాలు శైవాగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేసి వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి(రథ సేవ) మొక్కులు చెల్లించారు. కొందరు ఒడి బియ్యం , సారె సమర్పించారు.

భగవద్గీతతో విజ్ఞానం..



బచ్చన్నపేట : నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ భగవద్గీతను తప్పకుండా చదవాలని, విజ్ఞానం , వివేకం పెరుగుతాయని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక భువనగిరి, చేర్యాల, జనగామ, తొర్రూర్ కమిటీల అధ్యక్షులు దేవేందర్, లత తెలిపారు. ఆదివారం మండలంలోని నారాయణపురంలో భగవద్గీత అనుబంధ గ్రంథాలు, మహాశివ రాత్రి పండుగల విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.అనంతరం గ్రామస్తులకు పలు ఆధ్యాత్మిక పుస్తకాలను అందించారు. పంచాక్షరి, లావణ్య, రామరాజు, కవిత, శంకరయ్య, ఉపేందర్, లక్ష్మి, నారాయణ, మధుకర్, కోటి, లింగస్వామి, పలువురు పాల్గొన్నారు.

వానరాలతో పరేషాన్!

చేతికి దొరికినది ఎత్తుకుపోతున్న కోతులు
- బెంబేలెత్తుతున్న షాపుల యజమానులు
- కోతులను నివారించాలని కోరుతున్న ప్రజలు

బచ్చన్నపేట : వానరాల గుంపు కనిపిస్తే చాలు జనాలు హైరానా పడుతున్నారు. కోతి చేష్టలతో ఇళ్లల్లోకి చేరి చేతికి దొరికినది అందిన కాడికి ఎత్తుకుపోతున్నాయి. మండల కేంద్రంలో వానరాల గుంపు కనిపిస్తే చాలు కోతులొస్తున్నాయి జాగ్రత్త .. షాపులు బంద్ చేయండి అంటూ యజమానులు అరుస్తున్నారు. అలాగే వ్యవసాయ పంటలను ధ్వంసం చేయడమే కాకుండా కోతులు గ్రామాల్లోకి చేరి ఇళ్లలోకి చొరబడి అన్నం గిన్నెలను, ఇతర తిను పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. వాటిని తరిమే ప్రయత్నం చేస్తే తిరిగి మనుషులపైనే దాడులు చేస్తున్నాయి. మండల కేంద్రంలోని చిరువ్యాపారుల దుకాణాలపై, బాటసారులపై దాడులు చేసి కూరగాయలు, తినే పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వీధుల్లో సంచరిస్తున్న వానరాల గుంపు

షాపు తీయాలంటే భయమేస్తోంది



మండల కేంద్రంలో ఉన్న తన కిరాణా షాపు తీయాలంటే అప్పుడప్పుడు భయమేస్తోంది. ఒక్కో సారి కోతుల గుంపు షాపుపై దాడి చేసి తినే పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. షాపునకు వచ్చే వినియోగదారుల వద్ద నుంచి కూడా సామగ్రిని తీసుకెళ్తున్నాయి. కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి.

- ఎండీ.పాషా, కిరాణా షాపు యజమాని, బచ్చన్నపేట

కోతుల నివారణ కమిటీని వేశారు



మండల కేంద్రంలో కోతుల నివారణకు గ్రామస్తులు కమిటీని వేశారు. ఈ కమిటీ సభ్యులు పట్టణంలో డబ్బులు సేకరించి ఇనుప జాలీలను చేయించనున్నారు. వాటి ద్వారా కోతులను పట్టనున్నారు. అనంతరం కోతులను ఆటోల్లో తరలించి అడవుల్లో వదిలి పెడతారు.

- పెండెం నాగేష్, బచ్చన్నపేట

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

జఫర్‌గఢ్ : తమిళనాడు రాష్ట్రంలోని శివగంగా జిల్లా మానమధురై డిగ్రీ కళాశాలలో చదువుతున్న దళిత విద్యార్థి అయ్యస్వామి చేతులు నరికిన దుండగులను కఠినంగా శిక్షించాలని మహాజన ప్రజా పోరాట సమితి (ఎంపీపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి రవికుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దళిత విద్యార్థి తమ ఎదుట బుల్లెట్ బండి నడుపుతాడా అంటూ అగ్రకులాలకు చెందిన తోటి విద్యార్థులు అయ్యస్వామి రెండు చేతులు నరకడం దారుణమని విమర్శించారు. ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆధునిక యుగంలోను కులవివక్ష, దుర్మార్గపు ఆలోచన రావడం ఏమాత్రం సరికాదన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకోవాలని మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని రవికుమార్ డిమాండ్ చేశారు.

పంటలకు సాగునీరు విడుదల

బచ్చన్నపేట : మండలంలో యాసంగి నాట్లు వేసిన ఆయా గ్రామాల రైతులు దిగులు చెందొద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నర్మెట మండలంలోని బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి యాసంగి సాగు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని తమ్మడపల్లి, చిన్నరామన్ చర్ల గ్రామాలకు సాగు నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. అలాగే అన్ని గ్రామాలకు నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాస్‌రెడ్డి, సానిక రాజు, మూల రాజిరెడ్డి, రంగు అశోక్, బేజాడి సిద్దులు పలువురు పాల్గొన్నారు.



సాగునీటిని పరిశీలిస్తున్న బాల్‌రెడ్డి, రైతులు

ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలి

రఘునాథపల్లి : భూగర్భంలో లభించే ఇంధనాలు (డీజిల్, పెట్రోల్, గ్యాస్) పరిమితికి మించి వాడొద్దని, భావితరాలకు కొరత ఏర్పడుతుందని మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య పేర్కొన్నారు. సహజ వనరులను కాపాడుకొని, భవిష్యత్ తరాలను రక్షించుకుందామని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వశాఖ పిలుపు మేరకు ఆదివారం స్థానిక ఆర్‌జే ఫిల్లింగ్ స్టేషన్ ఆధ్వర్యంలో వినియోగదారులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మాజీ ఎంపీపీ, రిటైర్డ్ డీఎస్పీలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మా ట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాధ్యులు

వాలీబాల్ క్రీడాపోటీలు



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న మల్లేశం

బచ్చన్నపేట : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని లింగంపల్లిలో వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించినట్లు మాజీ సర్పంచ్‌లు కుందెన మల్లేశం, బొడ్డు కిష్టయ్యలు తెలిపారు. ఆదివారం క్రీడలను ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక నాయకుడు చాప భాస్కర్ ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలను నిర్వహించామని అన్నారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.5,016లు, రెండో బహుమతి రూ.2,016లు అందించడం జరుగుతుందన్నారు.

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చైర్మన్ మల్లారెడ్డి

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ స్వయంభు సిద్దేశ్వరాలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 24నుంచి 27వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26న శివ పార్వతుల కల్యాణం, 27న అగ్ని గుండం నిర్వహిస్తామని చెప్పారు. శివపార్వతుల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆలయ ఈఓ చిందం వంశీ, డైరెక్టర్లు కర్ణాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాశ్ రెడ్డి, బండారి శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి

ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలని అచల యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు మహాయోగి శ్రీ బ్రహ్మానంద శ్రీధర స్వామి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గీతాశ్రమంలో ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ కార్యాలయం ఈ నెల 22 నుంచి 28వతేదీ వరకు మద్భగవద్గీత 2వ అధ్యాయం నేర్పబడునని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు నేర్పుతామని ఆసక్తి కల వారు హాజరు కావాలని సూచించారు.

ముందస్తు జాగ్రత్తతో తప్పిన ప్రమాదం

పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలతో లారీ బీభత్సానికి భారీ ప్రమాదం జరిగేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో నిత్యం వందల మందితో బీజీగా ఉంటుంది. జనగామ, హనుమకొండ, హైదరాబాద్, తొర్రూరు, తిరుమలగిరి వెళ్లే ప్రయాణికులు తెల్లవారుజామునే చౌరస్తాకు చేరుకుంటారు.ఆయా గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజలతో రద్దీగా ఉంటుంది. ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలన్ని చౌరస్తాలో నిలిపివేసి ఉంటాయి. దీనికి తోడు చౌరాస్తాకు ఆనుకొని పండ్ల బండ్లు, ఇతర వ్యాపార దుకాణాలతో ఇరుకుగా ఉండేది. ఇలాంటి ప్రమాదాలను ముందే హెచ్చరించిన సీఐ మహేందర్‌రెడ్డి తన సిబ్బందితో ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చారు. ఆర్టీసీ బస్సులు చౌరస్తాలో కాకుండా కేవలం బస్టాండ్‌లో మాత్రమే ఆగేలా చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రయాణికులంతా బస్‌స్టాండ్‌కు మాత్రమే వెళ్తున్నారు. రెండో ఎస్సై లింగారెడ్డి చౌరస్తాను ఆనుకొని ఉన్న దుకాణాలను ఖాళీ చేయించడంలో శ్రద్ధ తీసుకున్నారు. పైరవీలకు తగ్గకుండా కచ్చితంగా ప్రైవేట్ వాహనాలు రోడ్డు పక్కన నిలుపవద్దని హెచ్చరించారు. దీంతో చౌరస్తాలో ప్రజల రద్దీ తగ్గింది. పోలీసులు చౌరస్తాలో అటు బస్‌స్టాండ్‌పై చేసిన కృషిని స్థానికులు అభినందిస్తున్నారు.

మొక్క నాటిన రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్ : బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మొక్క నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్క నాటినట్లు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు చందర్‌రెడ్డి, మారేపల్లి ప్రసాద్, కనకం గణేష్, గుండె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

బచ్చన్నపేట : మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ గుంటిపల్లి శ్రీనివాస్‌లో ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబానికి 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. శ్రీనివాస్ కూతురు పేరున లక్ష రూపాయలను బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండ్‌ను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొంతుల చంద్రమౌళి, పిచ్చెట్టి వేణుగోపాల్, దేవరకొండ వెంకట్, పన్నీరు సత్యం, శ్రీనివాస్, బేతి శ్రీధర్, శ్రీనివాస్, నర్సింహులు, షంషీర్, మల్లారెడ్డి, బాల్ నారాయణ, పరమేశ్వర్, హరిరాములు, హరి, శోభన్ పలువురు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మిత్రబృందం

ఘనంగా పోచమ్మ బోనాలు



హిమ్మత్‌నగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

జఫర్‌గఢ్ : మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో బొడ్రాయి, దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పోచమ్మ తల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బొడ్రాయి, దుర్గామాత ఉత్సవాలతో పాటు పెద్దమ్మ తల్లి, పోచమ్మ తల్లి పండుగలను నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి ప్రారంభమైన ఉత్సవాలను గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బోనాలను అలకరించిన మహిళలు డప్పు చప్పుళ్లతో వెళ్లి పోచమ్మ తల్లి వద్ద మొక్కులు సమర్పించారు. చల్లగా చూడమ్మా అంటూ వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

పెద్దవంగర: గ్రామ దేవతల ఒడిలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని గంట్లకుంట గ్రామంలో దుర్గామాత వేడుకలు ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి సంజయ్, నాయకులు యాదగిరి రావు, భాస్కర్ పాల్గొన్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ

చిల్పూరు : మండలంలోని రాజవరం ఎస్సీ కాలనీలో వీధిలైట్లు లేక అంధకారం నెలకొంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన ఎడ్ల రమేశ్ ఆరోపించారు. చాలా రోజులుగా కాలనీలో వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు రాత్రి పూట చీకటిలో బయటకు వచ్చేందుకు జంకుతున్నారని ఇదేవిషయాన్ని గ్రామ పంచాయతీ అధికారికి తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

జనగామ రూరల్ : తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ కలెక్టరేట్‌లో ఆదివారం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. అదే విధంగా ఆఫీస్ సబార్డినేట్ కుటుంబానికి రెవెన్యూ ఉద్యోగులు అందించిన ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి కలెక్టర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు క్రాంతి, జనరల్ సెక్రటరీ రామారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, కోశాధికారి సదానందం, ఉపాధ్యక్షులు రవి, లోకేష్ నాయకులు తహసీల్దార్లు శ్రీకాంత్, మన్సూరీ, రవీందర్, హుస్సేన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్, తహసీల్దార్లు

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



దేవేరులతో స్వామివారు

జనగామ రూరల్ : జనగామ పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణ తంతును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో భక్తజన సందోహం నడుమ వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శ్రీదేవి, భూదేవి నీలాదేవేరులతో స్వామి వారికి వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, మంగళహారతులు సమర్పించారు.

600 మందికి వైద్యపరీక్షలు



పాలకుర్తి: పరీక్షలు చేస్తున్న డాక్టర్ భిక్షపతి



జనగామ రూరల్: పెద్దపహాడ్ వైద్యశిబిరంలో పాల్గొన్న శివరాజ్

పాలకుర్తి : మండలంలోని చెన్నూరు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు ప్రముఖ వైద్య నిపుణుడు, కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 600 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా కుందూరు వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు గౌతం రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కారుపోతుల వేణు, భాస్కర్ రెడ్డి, బజ్జూరి వేణు, రమేశ్, సంజీవ రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపహాడ్ గ్రామంలో..

జనగామ రూరల్ : మండలంలోని పెద్దపహాడ్ గ్రామంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ పాల్గొన్ని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదలు, సామాన్యులకు మెరుగైన వైద్యం అందించే విధంగా ఎప్పటికప్పుడు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా డాక్టర్ల పర్యవేక్షణలో ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు, దంత వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, దూడల సిద్ధయ్య, ఏఎంసీ డైరెక్టర్ కొండల్ రెడ్డి, ప్రకాశ్, మల్లేశం, వైద్యులు శ్రీనివాస్, చందర్, నిహారిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోవులను కాపాడుదాం..

- సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి : పర్యావరణ పరిరక్షణకు గోవులను కాపాడుదామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. తన మ నుమరాలు నేహా జన్మదినం సందర్భంగా ఆదివారం హనుమకొండలోని చింతగట్టువద్ద ఉన్న మహర్షి గోశాలలో గోవుల పోషణకు గోపాల్‌రెడ్డి రూ.2,016 లు చెక్కు రూపంలో ఆగోశాల నిర్వాహకులు రమేష్ గురూజికి అందజేశారు. ఈ సందర్భంగా జంగాగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గోవులను రక్షించుకోవటం ద్వారా సేంద్రియ ఎరువులు పొంది తద్వారా భూ కాలుష్యాలను నివారిస్తూ ఆర్గానిక్ పంటల ద్వారా ఆరోగ్యసమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సైకిల్ వాకర్స్‌అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ పులివెంట్ల అనంత్, కోశాధికారి పిరమేష్, బాధ్యులు డాక్టర్ సాంబమూర్తి, రా జమౌళి, సునీల్‌రెడ్డి, సురేందర్, నర్సయ్య, వేణుగోపాల్, సమ్మిరెడ్డి, గోశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



గోవుల పోషణకు చెక్కు అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రమేశ్‌రెడ్డి (ఫైల్)

బచ్చన్నపేట : గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కొన్నె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నె గ్రామానికి చెందిన బడేకోలు రమేశ్ రెడ్డి (42) ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. అయితే కుటుంబ సమస్యల కారణంతో పదిహేను రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న రమేశ్ రెడ్డిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం కొన్నె గ్రామానికి మృతదేహన్ని తీసుకువచ్చారు. మృతుడికి భార్య మౌనిక, కుమారుడు, కూతురు ఉన్నారు. ఆర్ఎంపీగా పని చేస్తున్న రమేశ్ రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.